సాక్షి
ఖమ్మం

శనివారం ၊ 11 ၊ నవంబర్ ၊ 2023



బాణసంచా షాపులు సిద్ధం

ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో 157షాపులకు డ్రా పూర్తి కాగా, నేటి నుంచి అమ్మకాలు మొదలుకానున్నాయి. IIలో



డెంగీ నియంత్రణపై దృష్టి

జిల్లాలో డెంగీ కేసులు పెరగకుండా నియంత్రించేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 21°

జిల్లాలో శనివారం ఉదయం, సాయంత్రం చలిగాలులు వీస్తాయి. మిగతా సమయాన సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

ఖమ్మంలీగల్: కోర్టుల్లో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం మెరుగైన మార్గమని జిల్లా మధ్యవర్తిత్వ కేంద్ర సమన్వయకర్త, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా తెలిపారు. ఖమ్మంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జావీద్‌పాషా మాట్లాడుతూ వృత్తి నైపుణ్యం కలిగిన న్యాయవాదులు ఎవరికీ ఇబ్బంది లేకుండా మధ్యవర్తిత్వం నిర్వహించి కేసులు రాజీ దిశగా నడిపించాలని అన్నారు. కోర్టుల్లో కేసులు దాఖలు చేసుకున్న కక్షిదారులందరికీ ప్రత్యామ్నాయ పరిష్కారం ఉందని తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నామవరపు శ్రీనివాసశర్మ, మారగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఫింగర్ ప్రింట్ విభాగానికి జాతీయ గుర్తింపు



సీఐ సరేష్‌ను అభినందిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ఆధ్వర్యాన ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఫింగర్ ప్రింట్ బ్యూరోల డైరెక్టర్ల సదస్సులో ఖమ్మం కమిషనరేట్ ఫింగర్ ప్రింట్ విభాగం సత్తా చాటింది. ఈమేరకు జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించగా, శుక్రవారం సీపీ విష్ణు ఎస్.వారియర్ వివరాలు వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన సదస్సులో ఖమ్మం ఉద్యగులు ఛేదించిన కేసుకు ప్రశంసలు దక్కాయని తెలిపారు. 2020లో నేలకొండపల్లి మండలం అజయ్‌తండాలో దంపతులకు మత్తు మందు కలిపిన ప్రసాదం ఇచ్చి వారి ఇంట్లో చోరీ చేయగా, వేలిముద్రల ఆధారంగా నిందితులను గుర్తించడంతో వారికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసు దర్యాప్తుకు గాను ఫింగర్ ప్రింట్ విభాగానికి గుర్తింపు దక్కిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ఫింగర్ ప్రింట్ సీఐ నరేష్, సిబ్బందిని సీపీ వారియర్ అభినందించారు.

చేపల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: చేపల ఉత్పత్తిలో తెలంగాణను మత్స్యకారులు దేశంలోనే అగ్రగామిగా నిలపాలని సూర్యాపేట జిల్లా గడ్డిపల్లిలోని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త బి.లవకుమార్ కోరారు. పాలేరులోని శ్రీ పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మత్స్యకారులకు నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న వారికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశాక లవకుమార్ మాట్లాడారు. చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో సింగపూర్, మన దేశంలో పశ్చిమబెంగాల్ ప్రథమ స్థానాల్లో ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులు ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబిస్తూ తెలంగాణను అగ్రభాగానికి చేర్చాలన్నారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. చేపల ప్రత్యుత్పత్తి, పెంపకంలో ఆధునిక విధానాలు పాటిస్తే అధికోత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు పోటాపోటీ..



ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎంపీ నామ, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, జహీర్‌అలీ, వీ.వీ.రత్నం

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- ఖమ్మం నుంచి దాఖలు చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ
- జిల్లాలో పలు ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా..
- మొత్తంగా 147మంది అభ్యర్థులు.. 215 నామినేషన్ల సమర్పణ
- ఈనెల 13న పరిశీలన, 15వ తేదీన తుదిజాబితా విడుదల
- ఇక హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల తంతు ముగిసింది. ఈనెల 3న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. శుక్రవారంతో తెర పడింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు హోరాహోరీగా నామినేషన్లు వేశారు. సాయంత్రం అధికారులు విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 147మంది 215 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, గత ఎన్నికలతో పోలిస్తే ప్రధాన పార్టీల ర్యాలీలు అంతగా కనిపించలేదు. కొందరు మాత్రమే ర్యాలీలుగా వెళ్తే.. మరికొందరు సాదాసీదాగా ముగించేశారు. ఈనెల 13న నామినేషన్లను పరిశీలించనుండగా, 15న ఉపసంహరణ తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలనుంది. కీలక ఘట్టం ముగియడంతో అభ్యర్థులు మిగిలిన సమయాన్ని ప్రచారానికి కేటాయించనున్నారు.

నెమ్మదిగా ప్రారంభమై..

నామినేషన్ల ప్రక్రియ మొదటి మూడు, నాలుగు రోజులు మందకొడిగానే సాగింది. బీఆర్‌ఎస్ అభ్యర్థులను ముందుగానే ప్రకటించినా మంచి ముహూర్తం కోసం ఆగారు. కాంగ్రెస్ పార్టీకి ఖమ్మం, మధిర, పాలేరు అభ్యర్థులను గతంలోనే ప్రకటించినా.. వైరా, సత్తుపల్లి అభ్యర్థులను ఈనెల 6న వెల్లడించారు. ఖమ్మం అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు మూడు సెట్లు, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మధిర నుంచి మల్లు భట్టివిక్రమార్క రెండేసి సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఇందులో పొంగులేటి, భట్టి గురువారం నామినేషన్లు దాఖలు చేయగా, వైరా కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్‌నాయక్ శుక్రవారం వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు కూడా ఎక్కువ మంది గురు, శుక్రవారాల్లో నామినేషన్లు వేశారు. కాగా, కాంగ్రెస్‌తో చర్చలు సఫలం కాకపోవడంతో సీపీఎం ఒంటరిగానే బరిలో దిగగా, జిల్లాలో ఖమ్మం, పాలేరు, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు పోటీకి దిగారు.

అత్యధికంగా ఖమ్మం, పాలేరు

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 147మంది అభ్యర్థులు 215సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో అత్యధికంగా పాలేరు నుంచి 42మంది, ఖమ్మం నుంచి 39మంది 59 సెట్ల చొప్పున సమర్పించారు. అతి తక్కువగా వైరాలో 16మంది 23 సెట్ల నామినేషన్ల దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

అభ్యర్థులు	42	39	28	22	16
నియోజకవర్గం	పాలేరు	ఖమ్మం	సత్తుపల్లి	మధిర	వైరా
నామినేషన్లు	59	59	41	33	23

చివరి రెండు రోజుల్లోనే ఎక్కువ..

నామినేషన్ల ప్రక్రియ ఈనెల 3వ తేదీన మొదలైనా, చివరి రెండు రోజుల్లోనే ఎక్కువగా దాఖలయ్యాయి. ఈ రెండు రోజులు శుభ ముహుర్తాలు ఉండటంతో ఎక్కువ మంది ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులు కుటుంబ సమేతంగా సెంటిమెంట్‌గా భావించిన ఆలయాలకు వెళ్లి నామినేషన్ పత్రాలతో పూజలు చేశారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలుకు అవకాశం ఉండటంతో.. తొలుత తమ అనుచరులు, ముఖ్య నేతలతో నామినేషన్లు వేయించారు. ఆ తర్వాత మంచి రోజు చూసుకుని పూర్తిస్థాయిలో అఫిడవిట్లు దాఖలు చేశారు.



వైరాలో నామినేషన్ సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్‌నాయక్, పక్కన నాయకులు

ఇక ప్రచారంపై ఫోకస్..

అభ్యర్థులు ఇకనుంచి పూర్తిస్థాయిలో ప్రచారంపై దృష్టి సారించనున్నారు. ఇంతకాలం నామినేషన్లు సరిచూసుకోవడం, సమర్పించడం, అసంతృప్తులను బుజ్జగించే పనులకు ఎక్కువ సమయం కేటాయించడంతో ప్రచారం జోరుగా సాగలేదు. అయితే, బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో మూడు సభల్లో పాల్గొన్నారు. ఈనెల 21న మధిర, వైరా సభలకు ఆయన హాజరవుతారు. దీనికి తోడు అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా, మరింత జోరు పెరగనుంది. కాంగ్రెస్ అభ్యర్థులు భట్టి, తుమ్మల, పొంగులేటి ఇప్పటికే ప్రచార వేగం పెంచారు. వైరా, సత్తుపల్లి అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడంతో వారు కూడా అదే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో జిల్లాలో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు సమాచారం. అలాగే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని తాను పోటీ చేస్తున్న పాలేరు నియోజకవర్గంతోపాటు ఇతర చోట్ల కూడా అభ్యర్థుల తరఫున ప్రచారం మొదలుపెట్టారు.

భద్రాద్రి జిల్లాలో 136 నామినేషన్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను 136 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నియోజకవర్గం నుంచి 36 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. నామినేషన్లకు చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల తోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా భారీగా వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరుకున్న వారందరికీ నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. కాగా, చివరిరోజైన శుక్రవారం పినపాకలో 12, ఇల్లెందులో 15, కొత్తగూడెంలో 14, అశ్వారావుపేటలో ఎనిమిది మందితో పాటు భద్రాచలంలో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

బీఆర్‌ఎస్‌లోకి సంభాని!



ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ వద్దిరాజు సమక్షాన బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, నేతలు ఎడవల్లి కృష్ణ, డాక్టర్ రామచందర్‌నాయక్, కోటూరి మానవతారాయ్ తదితరులు

- ఇదే బాటలో ఎడవల్లి, ఊకె అబ్బయ్య, మానవతారాయ్
- ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షాన కారెక్కిన నేతలు
- సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, వైరాలో కాంగ్రెస్‌కు షాక్
- ఫలించిన ఎంపీలు వద్దిరాజు, నామ, ఎమ్మెల్యే సండ్ర మంత్రాంగం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ నేతలు పలువురు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కొన్నిరోజులుగా ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేసిన చర్చలతో ఆయా ముఖ్యనేతలు కారెక్కారు. పార్టీలో టికెట్లు దక్కక అసంతృప్తితో ఉన్న నేతలు శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షాన బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తొలుత వీరు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. మాజీ మంత్రి సంభానితోపాటు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్యతోపాటు ఎడవల్లి కృష్ణ, కోటూరి మానవతారాయ్, డాక్టర్ రామచందర్‌నాయక్, మడత వెంకట్‌గౌడ్‌తోపాటు పలువురు నేతలకు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆయా నేతలను ముందు కేటీఆర్ వద్దకు, ఆతర్వాత సీఎం కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్లారు.

రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లోకి..

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ సత్తుపల్లి నుంచి టికెట్ వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీలోనూ టికెట్ విషయంలో ముఖ్య నేతలను కలిసినా టికెట్ రాగమయికి కేటాయించిన రోజే ఆయన పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేయబోనని ప్రకటించిన వెంటనే ఎంపీలు వద్దిరాజు, నామ, ఎమ్మెల్యే సండ్ర ఆయనను బీఆర్‌ఎస్‌లోకి తీసుకునేందుకు పావులు కదిపారు. ఆ తర్వాత సంభాని కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



ఉమ్మడి జిల్లాలో పలువురు నేతలు..

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ టికెట్లు దక్కని ఆశావహులు పలువురు ఇదే బాట పట్టారు. కొత్తగూడెంకు చెందిన ఎడవల్లి కృష్ణ టికెట్ ఆశించగా పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. దీంతో ఆయనతోనూ ఎంపీ వద్దిరాజు మాట్లాడి బీఆర్‌ఎస్‌లోకి తీసుకొచ్చారు. అలాగే వైరా నియోజకవర్గానికి చెందిన రామచంద్రనాయక్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయనతోపాటు ఇల్లెందు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన కోటూరి మావతారాయ్ సహా కాంగ్రెస్‌లో అసంతృప్తితో ఉన్న పలువురు నేతలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకోగా... ఎంపీ వద్దిరాజు వీరిని తొలుత మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ మెజార్టీ స్థానాలు గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సీఎం కేసీఆర్ వద్దకు వీరిని తీసుకెళ్లడంతో కండువాలు కప్పి పార్టీలో చేరిన నాయకుల సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులకు తెలిపారు.

కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ..

ముఖ్యనేతలు బీఆర్‌ఎస్‌లో చేరడంతో సత్తుపల్లి, వైరా, ఇల్లెందు, కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ తగిలిందనే చెప్పాలి. ఆ పార్టీ టికెట్లు ప్రకటించి నిరాశకు గురైన వీరిని బుజ్జగించేందు యత్నాలు జరగకపోవడం... బీఆర్‌ఎస్ నేతలు పావులు కదిపి పార్టీలో చేర్చుకున్నారు. దీంతో అసంతృప్త నేతలను పార్టీ వైపు తిప్పుకోవడంలో ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలు చేసిన కృషి ఫలించినట్లయింది.

సమష్టి కృషితో బీఆర్‌ఎస్ బలోపేతం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ నాయక్ సమిష్టి కృషితో బీఆర్‌ఎస్‌లో పలువురు ముఖ్య నేతలు చేరారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఈసందర్భంగా వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలకు తోడు ఉమ్మడి బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారశైలితో పదికి పది స్థానాలు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే

- దొరల ప్రభుత్వాన్ని సాగనంపుదాం
- సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, మాజీ ఎంపీ పొంగులేటి



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చింతకాని: ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుని తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. చింతకానిలో పలు పార్టీలకు చెందిన పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో భట్టి, పొంగులేటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ 70 నుంచి 80 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసేదే చెబుతుందని.. చెప్పినవన్నీ చేసి తీరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ, శ్రీశైలం ప్రాజెక్టులు చెక్కు చెదరకపోగా, బీఆర్‌ఎస్ హయాంలోనే నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపాలు అనతి కాలంలోనే బయటపడడం పాలకుల అవినీతికి నిదర్శమని ఆరోపించారు. పదేళ్లగా రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్‌ఎస్ ప్రజల సంపదను దోపిడీ చేసి తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఈమేరకు ప్రజలందరూ ఉమ్మడి జిల్లాలో పది స్థానాలను గెలిపించి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టాలని భట్టి, శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మధిర నియోజకవర్గ పరిశీలకులు అవినాష్ వర్జుకర్, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కోటరాంబాబు, పుచ్చకాయల వీరభద్రం, మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కన్నెబోయిన గోపి తదితరులు పాల్గొనగా పార్టీలోకి చేరిన వారిలో కిలారు మనోహర్‌బాబు, కన్నెబోయిన సీతారామయ్య, చింతకాని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి సహా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వెబ్‌కాస్టింగ్ విధులపై అవగాహన అవసరం

మానిటరింగ్ టీంల శిక్షణలో కలెక్టర్ గౌతమ్



ఓటర్లకు పంపించే ఎపిక్ కార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల సందర్భంగా వెబ్‌కాస్టింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ టీమ్‌కు శుక్రవారం శిక్షణ ఏర్పాటుచేయగా కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ సమయంతో పాటు ముగిశాక పరిశీలన, పర్యవేక్షణ కీలకమని తెలిపారు. ప్రతీ అంశాన్ని వెబ్‌కాస్టింగ్ చేస్తూ అన్ని అంశాలు నమోదవుతున్నాయా, లేదా అని పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారి దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

కంట్రోల్ రూమ్ తనిఖీ

కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారంపై ఆరా తీశారు. ఇప్పటి వరకు యాప్ ద్వారా 298 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 561 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలపగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం ఓటర్లకు ఎపిక్ కార్డులను పోస్టులో పంపించేందుకు సిద్ధం చేస్తుండగా పరిశీలించారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

ప్రతీఒక్కరు ఓటరు స్వేచ్ఛగా, న్యాయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఖమ్మం, పాలేరు అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆయన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మహంతి మాట్లాడుతూ విలువైన ఓటు వినియోగంలో ప్రలోభాలకు గురికావొద్దని తెలిపారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈసమావేశాల్లో మాస్టర్ ట్రెయినీలు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, సీపీఓ ఏ.శ్రీనివాస్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి విజయనిర్మల, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి బోధన..

- రాష్ట్రంలో విద్యార్థులకు 2.3 కోట్ల పుస్తకాలు ఇచ్చాం
- రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాసాచారి



నేలకొండపల్లిలో విద్యార్థుల సామర్థ్యాలపై ఆరాతీస్తున్న డైరెక్టర్ శ్రీనివాసాచారి

నేలకొండపల్లి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడమే కాక విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాసాచారి వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెంలో పలు పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించడంతో పాటు తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. ఈ ఏడాది అనుకున్న సమయం కంటే ముందుగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలకు ఈ ఏడాది 2.3 కోట్ల పుస్తకాలు సరఫరా చేశామని చెప్పారు. మెరుగైన ఫలితాలు నమోదయ్యేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.రాములు, హెచ్‌ఎం హరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎంది త్యాగాల చరిత్ర

- మా అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రజాసమస్యలపై చర్చ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మధిరలో మాట్లాడుతున్న వీరభద్రం, పక్కన నాయకులు

వైరా/మధిర: అవకాశవాద రాజకీయాలు చేస్తూ డబ్బు సంచులతో వస్తున్న అభ్యర్థులను ఓడించి త్యాగాల చరిత్ర కలిగిన సీపీఎం అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. వైరా, మధిర సీపీఎం అభ్యర్థులు భూక్యా వీరభద్రం, పాలడుగు భాస్కర్ శుక్రవారం నామినేషన్లు దాఖలు చేయగా, హాజరైన తమ్మినేని మాట్లాడారు. అసెంబ్లీలో కమ్యూనిస్టులు లేని లోటు కనిపిస్తోందన్నారు. ఇదేఅదునుగా దోపిడీ చేయడానికి బూర్జువా పార్టీలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. కాగా, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయిన చోట కమ్యూనిస్టులతో పొత్తు లేకపోవడం వల్లే అలా జరిగిందనే విషయం త్వరలోనే వారికి తెలిసొస్తుందని తమ్మినేని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్ రావు, నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు, అన్నారపు కనకయ్య, బుర్రి ప్రసాద్, కాసాని ఐలయ్య, కొల్లి సత్యనారాయణ, శ్రీనివాసరావు, పిట్టల రవి, తాళ్లపల్లి కృష్ణ, మేరుగు సత్యనారాయణ, పారుపల్లి ఝాన్సీ నరేంద్ర, పొన్నం వెంకటేశ్వరరావు, వెంకట్, శీలం నర్సింహారావు, మందా సైదులు, మద్దాల ప్రభాకర్, బి.రమేష్, నండ్ర ప్రసాద్, తిరుమలయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను చట్టసభకు పంపండి

ఖమ్మంరూరల్: ప్రశ్నించే గొంతుకలను చట్టసభల్లోకి పంపించాలని పాలేరు సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం కోరారు. ఖమ్మం రూరల్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు అసెంబ్లీలో ఉంటేనే పేదల సమస్యలపై చర్చ జరిగి పరిష్కారమవుతాయని తెలిపారు.

క్లుప్తంగా

కలెక్టర్ ఆదేశాలతో పనులు మొదలు



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు – మన బడి పనులు ఆలస్యమవుతుండగా టాయిలెట్లు లేక విద్యార్థినులు అవస్థ పడుతున్నారు. అలాగే, ఈ పాఠశాల పోలింగ్ కేంద్రం కూడా కావటంతో సమస్య పరిష్కరించాలని ఫోన్ ద్వారా కలెక్టర్‌కు సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ తదితరులు మెసేజ్ పంపించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ సోమశేఖరశర్మ శుక్రవారం పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం గోపగాని రమేష్‌తో వివరాలు ఆరా తీశారు. అక్కడికక్కడే కాంట్రాక్టర్‌ను పిలిపించి సూచనలు చేయడంతో టాయిలెట్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఎంఈఓ బి.రాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణం



వేముల సాహితి

ఖమ్మంస్పోర్ట్స్: కేరళ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మంకు చెందిన వేముల సాహితి 72 కేజీల కేటగిరీలో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఇప్పటికే ఆమె ఇదే టోర్నీలో వరుసగా మూడుసార్లు విజయం సాధించగా, నాలుగో సారి కూడా పతకం సాధించి సత్తా చాటింది. సాహితిలో ప్రతిభను గుర్తించిన ఫెడరేషన్ నిర్వాహకులు మలేషియాలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం కవిత డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఆమె పతకం సాధించడంపై పలువురు అభినందించారు.

సేవారంగమే ఆర్థికాభివృద్ధికి ప్రాణవాయువు



సదస్సులో మాట్లాడుతున్న రవికుమార్

ఖమ్మం సహకారనగర్: ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు సేవారంగమే ప్రాణవాయువుగా నిలుస్తోంది ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధి సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జస్టి రవికుమార్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యాన జరుగుతున్న జాతీయ సదస్సు రెండో రోజైన శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవికుమార్ ప్రధానవక్తగా మాట్లాడుతూ ప్రతీఒక్కరు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సేవలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాగా, సాంకేతికతతో పాటే ఆర్థిక మోసాలు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సదస్సు కన్వీనర్, కామర్స్ శాఖాధిపతి డాక్టర్ మాట్లాడగా వైస్ ప్రిన్సిపాల్ జీవన్ కుమార్‌తో పాటు డాక్టర్ ఏ.ఆర్.సత్యవతి, డాక్టర్ ఎన్.గోపి, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వీరబ్రహ్మం, డి.సుజాత, ఎస్.రమేష్, డి.వి.రమణ, స్వామి పాల్గొన్నారు.

బాణసంచా షాపులు సిద్ధం


- 150 షాపుల ఏర్పాటుకు డ్రా



బాణసంచా లోడ్‌తో వచ్చిన లారీ

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో దీపావళి బాణసంచా షాపులు సిద్ధమయ్యాయి. మొత్తం 150 షాపుల కేటాయింపునకు శుక్రవారం డ్రా నిర్వహించి వ్యాపారులను ఖరారు చేశారు. దీంతో వారు షాపుల ఏర్పాట్లలో నిమగ్నం కాగా, శనివారం సాయంత్రం నుంచి అమ్మకాలు మొదలవుతాయి. కాగా, గతంలో కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తే మళ్లీ ఈసారి కూడా దక్కించుకుని, ఒక్కో తాత్కాలిక షాపు నిర్మాణానికి రూ.20వేల మేర వసూలు చేసినట్లు తెలిసింది. ఇక షాపుల కేటాయింపులోనే భారీగానే డబ్బు చేతులు మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, షాపుల కేటాయింపునకు డ్రా పూర్తికాకుండానే బాణసంచా లోడ్‌తో కూడిన లారీలు కళాశాల మైదానానికి చేరుకున్నాయి. అక్కడ అగ్నిమాపక వాహనం, మంటలు ఆర్పే పరికరాలు లేకపోయినా బాణసంచా తెప్పించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం విమర్శలకు తావిచ్చింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

'కారు' తొలిసారి!



ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు తొలిసారిగా కారు గుర్తుపై బరిలోకి దిగుతున్నారు. వీరిలో కొందరు గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలిచారు. ఆ తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరగా.. సిట్టింగ్‌లకే టికెట్లు అన్న ప్రకటన మేరకు కేసీఆర్ బీఫామ్‌లు ఇచ్చారు. దీంతో తొలిసారిగా కారు గుర్తుపై పోటీ చేయనున్నారు. – బూర్గంపాడు

బీఆర్ఎస్‌లోనే ఉన్నా తొలిసారి గుర్తుపై పోటీ

- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పలు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఒకసారి వైఎస్సార్‌సీపీ నుంచి, మిగతా అన్ని సార్లు కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగి గెలిచాక బీఆర్ఎస్‌లో చేరారు. తొలిసారి కారు గుర్తుపై బరిలోకి దిగుతున్నారు.
- పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు 2009, 2018లో పినపాక అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. అనంతరం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఆయన ఈసారి అదే పార్టీ నుంచి కారు గుర్తు పై పోటీ చేస్తున్నారు.
- ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత ఆమె గులాబీ పార్టీలో చేరారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.
- అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన కూడా టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈసారి ఎన్నికల్లో కారు గుర్తుపై తొలిసారి పోటీలో ఉన్నారు.
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలవగా, అనంతరం పరిణామాల్లో బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు ఆయన సైతం బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగుతున్నారు.
- పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి బీఆర్ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు. అనంతరం బీఆర్ఎస్ గూటికి చేరగా.. ఈసారి ఆయన సిట్టింగ్ కోటాలో బీఆర్ఎస్ బీఫామ్ దక్కించుకున్నారు.
- వైరా నుంచి లావుడ్యా రాములునాయక్ ఇండిపెండెంట్‌గా గత ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన ఆయనకు ఈసారి టికెట్ దక్కలేదు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా టికెట్ అందుకున్న బానోతు మదన్‌లాల్ తరఫున ప్రచారంలో నిమగ్నమయ్యారు.

- పినపాక నుంచి గత ఎన్నికల్లో రేగా కాంతారావు కాంగ్రెస్ తరఫున, పాయం వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ నుంచి పోటీ చేశారు. ఈసారి మారిన పరిణామాల నేపథ్యాన వారిద్దరి కండువాలు తారుమారు కాగా.. మళ్లీ ప్రత్యర్థులుగానే బరిలో ఉన్నారు.
- ఇల్లెందు అసెంబ్లీ స్థానం నుంచి కూడా పాత అభ్యర్థులే పోటీ చేస్తున్నా పార్టీలు మాత్రం మారాయి. గత ఎన్నికల్లో బానోతు హరిప్రియ కాంగ్రెస్ నుంచి, కోరం కనకయ్య బీఆర్ఎస్ నుంచి పోటీ చేశారు. ఆ తర్వాత హరిప్రియ బీఆర్ఎస్‌లోకి రాగా, ఇటీవల కనకయ్య కాంగ్రెస్ గూటికి చేరారు. ఇలా ఈసారి మళ్లీ ఇద్దరు పోటీ పడుతున్నప్పటికీ పార్టీలు వేర్వేరు కావడం విశేషం.

జంగ్ తెలంగాణ

పువ్వాడ ఆస్తులు రూ.51.40కోట్లు

- 2018 ఎన్నికల్లో రూ.27.48 కోట్లుగా వెల్లడి
- తుమ్మల నాగేశ్వరరావు ఆస్తులు రూ.17.88కోట్లు..



ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నామినేషన్ వెంట తమ ఆస్తుల వివరాలతో కూడిన అఫిడవిట్లను సమర్పించారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తమ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఇందులో అజయ్‌కుమార్ తన ఆస్తుల విలువను రూ.51,40,36,856గా చూపించారు. తన పేరిట చరాస్తులు రూ.7,55,06,145, స్థిరాస్తులు రూ.21,18,35,000గా పేర్కొనగా, ఆయన సతీమణి వసంతలక్ష్మి పేరిట చరాస్తులు రూ.4,40,35,711గా, స్థిరాస్తులు రూ.18,26,60,000 ఉన్నాయని తెలిపారు. కాగా, అజయ్‌కుమార్ పేరిట బ్యాంక్‌లో రూ.75,68,993 రుణం తీసుకోగా, 2022–23 ఏడాదిలో అజయ్‌కు రూ.89,93,070, ఆయన సతీమణికి రూ.1,60,10,070 ఆదాయం ఉన్నట్లు వెల్లడించారు.

గత ఎన్నికల్లో రూ.27కోట్లు!

2018 ఎన్నికల సమయంలో పువ్వాడ అజయ్ తనకు రూ.27,48,93,867 ఆస్తులు ఉన్నాయని అఫిడవిట్‌లో చూపించారు. ఇందులో చరాస్తులు రూ.7,06,98,135, స్థిరాస్తులు రూ.4,80,48,000 ఉన్నాయని, ఆయన సతీమణి పేరిట చరాస్తులు రూ.3,89,17,619, స్థిరాస్తులు రూ.10,58,20,000, కుమారుడు నయన్‌రాజ్ పేర చరాస్తులు రూ.12,94,613, స్థిరాస్తులు రూ.1,01,25,500 ఉన్నాయని వెల్లడించారు. అదే అఫిడవిట్‌లో అజయ్‌కు రూ.1,50,63,694, వసంతలక్ష్మికి రూ.1,59, 24,007 బ్యాంక్‌ల్లో రుణం ఉందని తెలిపారు. ఇక ఆదాయం అజయ్‌కు రూ.67,39,150.. వసంతలక్ష్మికి రూ.1,15,79,740 ఉందని పేర్కొన్నారు.

తుమ్మల ఆస్తులు ఇవే..



ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన ఆస్తులను రూ. 17,88,82,858 గా చూపించారు. ఇందులో చరాస్తులు రూ.69,51,079 విలువైనవి ఉండగా, స్థిరాస్తులేమీ లేవని వెల్లడించారు. ఆయన సతీమణి భ్రమరాంబ పేరిట చరాస్తులు రూ.95,33,923 చూపించగా.. స్థిరాస్తుల విలు వ రూ.7,02,80,000 గా పేర్కొన్నారు. అలాగే, హెచ్‌యూఎఫ్(హిందూ అన్ డివైడెడ్ ఫ్యామిలీ)కు సంబంధించి చరాస్తులు రూ.2,32,87,566, స్థిరా స్తులు రూ.6.88 కోట్ల విలువైనవి ఉన్నాయని తెలిపా రు. కాగా, తుమ్మల సతీమణి పేరిట రూ. 81,56,736 బ్యాంక్ రుణం ఉండగా, తుమ్మల ఆదాయం రూ.8,83,870, ఆయన సతీమణికి పేరుతో రూ.49,21,280, హెచ్‌యూఎఫ్ కింద రూ. 49,93,820 ఆదాయం ఉందని పేర్కొన్నారు. కా గా, 2018 ఎన్నికల సమయాన ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో రూ.12,20,10,178 ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో అప్పటితో పోలిస్తే ఆస్తుల విలువ రూ.5కోట్ల మేర తగ్గడం గమనార్హం.

ఆలయాల్లో పూజలు.. ఆపై నామినేషన్



సాయిబాబా పాదాల వద్ద నామినేషన్ పత్రాలు పెడుతున్న మంత్రి పువ్వాడ అజయ్ – వసంతలక్ష్మి దంపతులు

ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి వసంతలక్ష్మి తో కలిసి నగరంలోని శ్రీ షిర్డీ సాయిబాబా, శ్రీ సీతారామాంజనేయ స్వామి, స్తంబాద్రి శ్రీలక్ష్మి నర్సింహస్వామి, శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి, శ్రీదాసాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశాక ఆర్‌ఓ కార్యాలయానికి బయలుదేరారు. ఆతర్వాత నియోజకవర్గానికి ఈశాన్యంగా ఉన్న రఘునాథపాలెం మండలం కేవీ.బంజరలోని రామాలయంలో పూజలు చేసి మండలంలో ప్రచారం ప్రారంభించారు. గత రెండు ఎన్నికల్లోనూ ఆయన ఇక్కడే పూజలు చేసి ప్రచారం మొదలపెట్టారు. – ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం

పుష్టిగా తినాలి.. ఫుల్‌గా కష్టపడాలి!



టిఫిన్ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు

పొద్దంతా ప్రచారం చేయాలంటే ఫుల్‌గా తినాలి.. పుష్టిగా ఉండాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు సూచించారు. ఖమ్మంలోని 9, 10వ డివిజన్లలో శుక్రవారం ఉదయం ప్రచారం చేసిన ఆయన 11వ డివిజన్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో ఒక హోటల్ వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేశారు. ఈక్రమంలో ఆయన ఫుల్‌గా లాగించండి.. పొద్దంతా ప్రచారం చేయాలంటే తప్పదు అంటూ మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, చావా నారాయణరావు తదితరులకు సూచించడం కనిపించింది. – ఖమ్మం అర్బన్

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయండి..

రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి/వేంసూరు: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని సత్తుపల్లి బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి పిలుపునిచ్చారు. సత్తుపల్లి మండలం నారాయణపురం, వేంసూరు మండలంలోని కుంచపర్తి, భీరపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతీ ఇంటికి వెళ్లి కేసీఆర్ ప్రభుత్వంలో అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బీఆర్ఎస్‌లో చేరడం శుభ పరిణామన్నారు. కార్యకర్తలందరూ కేసీఆర్, సండ్ర వెంకటవీరయ్యగా భావించుకుని పని చేస్తే విజయం సులువవుతుందని తెలిపారు. ఈసమావేశాల్లో ఎంపీపీలు దొడ్డా హైమావతి, పగుట్ల వెంకటేశ్వరరావుతో పాటు నాయకులు కూసంపూడి రామారావు, గొర్ల సంజీవరెడ్డి, దేశిరెడ్డి రంగారెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, గోగులమూడి బాలాజీరెడ్డి, దాసరి ప్రభాకర్‌రెడ్డి, దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యుదిష్టర్, దొడ్డ వెంకటకృష్ణరెడ్డి, మందపాటి సత్యనారాయణరెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, ఎస్.కే.నాగుల్‌మీరా, మందపాటి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌వి అబద్ధపు ప్రచారాలు

- రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోంది...
- మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మంమామిళ్లగూడెం: ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు చేస్తున్నవన్నీ అబద్ధపు ప్రచారాలేనని బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ పాలేరు అభ్యర్థి నున్నా రవికుమార్, జనసేన ఖమ్మం అభ్యర్థి ఎం.రామకృష్ణతో కలిసి శుక్రవారం ఆయన ఖమ్మంలో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రాతిపదికన సాధించుకున్న తెలంగాణలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఏహామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే బీజేపీ వస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. బీసీని ముఖ్యమంత్రిగాప్రకటించిన బీజేపీ ద్వారా అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కాగా, జిల్లాలో పలువురు నేతల ఇళ్లపై జరిగిన ఐటీ దాడులతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో వీచేది మా గాలి..

సత్తుపల్లిటౌన్: ప్రధాని మోదీ నాయకత్వాన తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రాబోతోందని.. ఇప్పుడు తమ పార్టీ గాలే వీస్తోందని పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సత్తుపల్లిలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయగా, రింగ్‌సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మోదీ సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలుకావాలంటే ఇక్కడ బీజేపీ అధికారంలోకి రావాల్సి ఉందని తెలిపారు. సమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు నున్నా రవికుమార్, మార్తి వీరభద్రప్రసాద్, ధనియాకుల వెంకటనారాయణ, త్రిలోకేశ్వర్, సరస్వతి, బి.వీరంరాజు, మట్టా ప్రసాద్, నాయుడు రాఘవరావు, పి.మధుసూదన్‌రావు, పాలకొల్లు శ్రీనివాసరావు, ఎ.రామారావు, నాగస్వామి పాల్గొన్నారు.

ఇదీ మా మేనిఫెస్టో!

- అభ్యర్థులకు సమస్యలను తెలిపేలా కరపత్రాలు



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కరపత్రంతో సురేందర్‌రెడ్డి

కారేపల్లి: సాధారణంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి పార్టీల మేనిఫెస్టో ఆధారంగా ప్రచారం చేయడం ఆనవాయితీ. అయితే, సింగరేణి (కారేపల్లి) గ్రామ ప్రజల తరఫున సామాజిక కార్యకర్త సురేందర్‌రెడ్డి గ్రామంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు వైరా నియోజకవర్గ అభ్యర్థులకు తెలిసేలా కరపత్రాలు ముద్రించాడు. వీటిని ప్రజలకు అందజేస్తూ ప్రచారానికి వచ్చే నాయకులకు సమస్యలను వివరించాలని కోరుతున్నారు. బొగ్గుగనుల పుట్టినిల్లయిన సింగరేణి(కారేపల్లి) గ్రామాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని, కారేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, 60 ఏళ్ల చరిత్ర ఉన్న కారేపల్లి సంతను అభివృద్ధి చేయాలనే తదితర డిమాండ్లను ఆయన కరపత్రంలో ముద్రించాడు.

డెంగీ నియంత్రణపై దృష్టి సారించండి



వైద్య, ఆరోగ్యశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: పరీక్షల సంఖ్య పెంచడం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ డెంగీని నియంత్రించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 456 డెంగీ కేసులు నమోదు కాగా, గత రెండు వారాల్లో 26 కేసులు వెలుగు చూశాయని తెలిపారు. డెంగీ బారిన పడిన వారికి చికిత్స అందిస్తూనే నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సదరు వ్యక్తి ఇంట్లో, చుట్టుపక్కల ఇళ్లలో అందరికీ పరీక్షలు చేస్తే నియంత్రణ సులువవుతుందని తెలిపారు. అలాగే, దోమల ఉధృతి, నీరు నిల్వ ఉంటే వచ్చే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీపీఓ హరికిషన్, డీఈఓ సోమేశ్వరశర్మ, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి.వెంకటేశ్వర్లు, అధికారులు మల్లీశ్వరి, సైదులు, పుల్లారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5,63,620 మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా ఉండగా.. అందుకు అనుగుణంగా కేంద్రాలు ప్రారంభిస్తూ రైతులకు వసతులు కల్పించాలన్నారు. రైస్‌మిల్లర్ల వద్ద ధాన్యం అన్ లోడింగ్ ఆలస్యంగా కాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే, సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లపై దృష్టి సారించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీఆర్డీఓ విద్యాచందన, డీఎస్‌ఓ శ్రీలత, డీఏఓ విజయనిర్మల, డీసీఓ విజయకుమారి, డీటీఓ కిషన్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం పాల్గొన్నారు.

నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా బాలుర జట్టుతో కోచ్‌లు, పీఈటీలు



బాలికల జట్టు..

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి అండర్ – 14 బాలబాలికల నెట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో శుక్రవారం జరిగిన ఎంపిక పోటీలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిలో జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు సూర్యతేజ, లోకేశ్, వినయ్, సిద్ధూ, జగన్, వివేకానంద, రాంచరణ్, ఉజ్వల్ అయాన్, నవదీప్ వినయ్, కార్తికేయ, రాజు, వరుణ్ ఎంపిక కాగా.. బాలికల విభాగంలో అవంతిక, శ్రీవాణి, మహేశ్వరి, ఎఫ్సిబా, నందిని, సింధుప్రియ, హారిక, ధనలక్ష్మి, సమీరా, పవిత్ర, సింధు, ప్రసన్నకుమారి, గౌతమి పూర్ణిమ ఎంపికయ్యారు. జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నర్సింహమూర్తి, నెట్‌బాల్ సీనియర్ కోచ్ పీవీ రమణ, పీఈటీ కృష్ణ, సైదేశ్వరరావు, బిక్కెన్, రోజా, రవి తదితులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

- ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగి మృతి

పాల్వంచ: ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కారు చెట్టుకు ఢీకొట్టడంతో ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బూర్గంపాడు మండలం గోపాలపురానికి చెందిన ఎస్‌కే లాల్‌పాషా (40) భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం భద్రాచలం నుంచి విజయవాడకు కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. కాగా పాల్వంచ శ్రీనివాసకాలనీ సమీపంలో కారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. కారు స్టీరింగ్ చాతి భాగంలో బలంగా తగిలింది. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడి భార్య గతంలో కోవిడ్‌తో మృతి చెందగా.. కుమారుడు, కుమార్తె ఉన్నారు. లాల్‌పాషా సోదరుడు పెద్దయాకూబ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం

మధిర: మధిర రైల్వేస్టేషన్, ట్రాక్ పరిసరాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ గంజాయి తరలిస్తున్న వ్యక్తుల వివరాలు తెలియరాలేదు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలను రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు జి.చంద్రశేఖర్, ఎం.శార్వాణి, ఉద్యోగులు సీహెచ్.గోపి, షేక్ రియాజ్, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

మందు పాతర పేలి యువకుడికి తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా దుబ్బమరక – బోటుకేద్వాల్ అటవీ మార్గంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి బైక్‌పై వెళ్తున్న డబ్బామర్క గ్రామానికి చెందిన యువకుడు వెట్టి గంగాకు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు సదరు యువకుడిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!

ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధనత్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్టెటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందు వల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరు ధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగి



నంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.

ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.



మంచి కొవ్వు మంచిదే!

లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...



బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ-కాఫీ మరకలు

టీ-కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.



● ధనుష్, ఇళయరాజా

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసిన ట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

లింగి లింగిడి..!

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.



● సోహైల్

మాస్ రింగు..

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.



● 'ది ట్రయల్' పోస్టర్

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.